1

# నిజమైన భక్తులకు నిత్యం పండుగే!

బ్రహ్మమిదియని చెప్పంగగలరు కాని
కాదు ఇదియని చెప్పంగలేరు సుమ్మి
ఉన్నదొక్కటె దైవంబు ఎన్నటికిని
లేనిదయ్యెను లోకంబు కాంచరయ్య

ప్రేమస్వరూపులారా! ఈనాడు నూతన సంవత్సరము ప్రారంభమైనదని అందరూ ఉత్సాహంతో ఉబ్బితలూగుతున్నారు. ఇది గురువారమునాడు ప్రారంభమైనదని ఆనందిస్తున్నారు. అయితే, ఈ ఒక్క దినమును మాత్రమే పండుగ జరుపుకోవటం కేవలం వెఱ్ఱితనము. నిజమైన భక్తులకు నిత్యం ఒక పండుగనే. ప్రతి నిమిషమూ, ప్రతి దినమూ నూతన సంవత్సర శుభారంభమేనని భావించుకొని మీరు నూతనమైన, పవిత్రమైన భావాలను అభివృద్ధి పరచుకోవాలి. గడిచిపోయినదానిగురించి, భవిష్యత్తును గురించి విచారిస్తూ కాలమును వ్యర్థం చేయకూడదు. ఈ జగత్తునందు కనిపించునదంతయు అనిత్యమైనది, అశాశ్వతమైనది. Past is past. గడచిపోయినది మనము ఎంత ప్రార్థించినా తిరిగి రాదు. భవిష్యత్తు అనేది కాలగర్భములో దాగిఉంది. దానిని చూచుటకు సాధ్యం కాదు. కాబట్టి వర్తమానమే ప్రధానమైనది. వర్తమానమును విస్మరించి గతాన్ని, భవిష్యత్తును గురించి విచారించటం పెద్ద అజ్ఞానమనే చెప్పవచ్చు. కాబట్టి, మీరు సేవలలో ప్రవేశించి వర్తమానమును సార్థకం చేసుకోవాలి. సేవకంటే మించిన సాధన మరొకటి లేదు. జపము, తపము, భజన ఇత్యాది సాధనలకంటే సేవయే ప్రధానమైనది. సేవలవలన కలిగే ఫలితమే నిత్యసత్యమైనది. భగవంతుడు మీకు కాయమునిచ్చినది పరోపకారార్థమేగాని, కేవలం తిని, త్రాగి కాలమును వ్యర్థం చేసే నిమిత్తము కాదు. మన దేహములోని ప్రతి అంగము కర్మోపాసన నిమిత్తమై ఇవ్వబడినది. కర్మోపాసనయే మానవునికి ధన్యత చేకూర్చునటువంటిది. భగవంతుడు చేతులనిచ్చినది నోటికి ముద్దందించటానికి కాదు, సేవలు చేయటానికే చేతులు ఇవ్వబడినవి. కాబట్టి, నిస్వార్థంగా సేవలలో పాల్గొని సత్కీర్తిని సాధించండి. నిరంతరం మంచి పనులు చేస్తూ ఉన్నప్పుడే మీరు జీవితంలో సుఖశాంతులను అనుభవించగలరు.

"న సుఖాత్ లభ్యతే సుఖం" సుఖమునుండి మనకు సుఖము లభించదు. కష్టమునుండియే సుఖము లభిస్తుంది. ఈనాడు అనేకమంది పల్లెప్రజలు సుఖాలను, భోగభాగ్యాలను ఆశించి పట్టణాలకు వలసపోతున్నారు. సుఖంకోసం ప్రాకులాడి దుఃఖాన్ని చేతులారా తెచ్చిపెట్టుకుంటున్నారు. మన ప్రాచీన సంస్కృతి అంతో ఇంతో పల్లెలయందే ఉన్నదిగాని, పట్టణాలలో లేదు. పట్టణాలలో మన సంస్కృతిని పాడుచేసిపెడుతున్నారు. మనం పల్లెలకు వెళ్ళి వాళ్ళ అవసరాలను అడిగి తెలుసుకొని, అందుకు తగినట్లు సేవలు సల్పాలి. వాళ్ళ కష్టాలను నివారణ గావించటానికి కృషిచేయాలి.

ప్రేమస్వరూపులారా! సేవంటే ఏమనుకుంటున్నారు మీరు? కష్టాలలో ఉన్నవారికి సహాయపడటమే సేవగా భావిస్తున్నారు మీరు. ఇంతమాత్రమే కాదు. మన దేహములోని సర్వాంగములూ సేవల నిమిత్తమే అందించబడినాయిగాని, ఇతర కర్మల నిమిత్తం కాదనే సత్యాన్ని మీరు గుర్తించి వర్తించాలి. మీ దేహమును నిరంతరం సేవలకే అంకితం గావించాలి. మీరు ఎన్నో మందిరాలు కడుతున్నారు, ఎన్నో సాధనలు చేస్తున్నారు. అవన్నీ కేవలం తాత్కాలికమైన తృప్తిని మాత్రమే కలిగిస్తాయిగాని, శాశ్వతమైన ఆనందాన్ని అందించలేవు. నిత్యసత్యమైన ఆనందాన్ని అనుభవించాలంటే సేవ తప్ప మరో మార్గము లేదనే సత్యాన్ని మీరు దృఢంగా విశ్వసించాలి. కష్టాలలో ఉన్నవారికి సహాయం చేయాలి. కేవలం ఆరోగ్య సేవలు మాత్రమే కాదు, అన్నివిధములైన సేవలు చేయాలి. మీరు పూజలు, సాధనలు చేసినంతమాత్రమున భగవంతుడు ఆనందించడు; సేవలలో పాల్గొన్నప్పుడే భగవంతునికి ఆనందము. కనుక సేవలు చేయండి.

The best way to love God is to love all and serve all. ప్రేమ, సేవ...ఈ రెండిటినీ మీరు అలవర్చుకుంటే అంతకంటే గొప్ప సాధన మరొకటి లేదు. సేవలకై మనం లక్షలు ఖర్చు పెట్టనక్కర్లేదు. కాలాన్ని వ్యర్థం చేయకుండా ప్రేమతో చేతనైన సేవలు సల్పుతూ మన జీవితాన్ని సార్థకం గావించుకోవాలి.

జీవుడే దేవుడనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి

ప్రేమస్వరూపులారా! ఈనాడు భజన చేసిన పిల్లలు సేవాదళంవారు (శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో చదివిన పూర్వవిద్యార్థులు). సేవలలో పాల్గొని స్వామిని ఆనందపెట్టాలని వారు ఆశిస్తున్నారు. సేవలు చేయటానికై అనేక శ్రమలకోర్చి వాళ్ళ జీతాల్లో కొంత మిగుల్చుకొని ఈనాడు 48 లక్షలు పట్టుకొని వచ్చారు. ఇది ఎవరికి? సేవలకై ఇచ్చినవి. దరిద్రనారాయణుల సేవచేయటం చాలా ఉత్తమమైనటువంటిది. కనుక, నేను వాళ్ళకు చెప్పాను "నాయనా! ఆ డబ్బును బ్యాంకులో పెట్టుకొని దానిపైవచ్చే వడ్డీతో మీరు నిత్యమైన సేవలు చేస్తూ రండి" అని. ధనముచేత మన గుణములు అభివృద్ధి కాజాలవు. త్యాగమునందే నిజమైన యోగమున్నది. భోగముచేత రోగమే వస్తుంది గాని, యోగమురాదు. కనుక, మీరు త్యాగముచేత యోగాన్ని సంపాదించండి. "త్యాగేనైకే అమృతత్వమానశుః" త్యాగము చేతనే మీరు శాశ్వతానందాన్ని అందుకోగలరు. త్యాగము లేకుండా దైవచింతన చేస్తే ప్రయోజనం లేదు. మీ మనస్సు తృప్తి పడవచ్చును. అంతే! ముఖ్యంగా ప్రతి జీవుడూ దేవుడేనన్న సత్యాన్ని మీరు గుర్తించి వర్తించాలి.

"ఈశ్వరస్సర్వ భూతానాం", "ఈశావాస్య మిదం జగత్" దైవమే అందరియందు ఉండి ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. భగవంతుడు ఎక్కడో ఏదో ఒక గుడియందు నిలిచివున్నాడని మీరు భావించకూడదు. "దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః" మన దేహమే దైవమందిరము. దైవము మన హృదయమునందే ప్రతిష్ఠితుడై ఉన్నాడు. కనుకనే, దీనికి హృదయము అని పేరు పెట్టారు. దయతో నిండినదే హృదయము. అట్టి హృదయముతో మీరు ఏ సేవ చేసినా అది సార్థకమవుతుంది. ప్రతి మానవుని దైవస్వరూపునిగా భావించండి. సర్వాంతర్యామియైన దివ్యత్వాన్ని మరచిపోయి అల్పమైన దేహానందము నిమిత్తమై ప్రాకులాడకండి. ఈ దేహముతో మనం ఏమాత్రం సుఖాన్ని పొందలేము. అనేక పరిమితులతో కూడినది ఈ దేహము. దీనితో అపరిమితమైన ఆనందాన్ని సాధించలేము.

*దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్*
*దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్*
*మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడ యా*
*దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!*

కాబట్టి, దేవదేవుడు మీలోనే ఉన్నాడు. అలాంటప్పుడు మీరు ఎక్కడికి వెళ్ళి పూజ చేస్తున్నారు? ఎవరిని పూజిస్తున్నారు? మిమ్మల్ని మీరే పూజించుకుంటున్నారు. ఎవరినైనా గౌరవిస్తే మిమ్మల్ని మీరే గౌరవించుకుంటున్నారు. ఎవరినైనా అవమానిస్తే మిమ్మల్ని మీరే అవమానించు కుంటున్నారు. మన కంటికి కనిపించే జీవులను బాధిస్తూ, కనిపించని దేవుని పూజిస్తే లాభం లేదు. మీ ఎదుటనున్న ప్రతి మానవుడుకూడను దేవుడే! కనుకనే మన ప్రాచీనఋషులు 'దైవం మానుషరూపేణ' అన్నారు. అట్టి ప్రత్యక్షస్వరూపుడైన దేవుని విస్మరించి పరోక్షంగా విగ్రహాలను, బొమ్మలను పూజిస్తే ప్రయోజనం లేదు. ప్రతి వ్యక్తిని మీరు దైవంగా భావించండి. మిమ్మల్ని ద్వేషించేవానిని సైతం 'హలో బ్రదర్' అని ప్రేమతో పలుకరించండి. అప్పుడతను కూడా ద్వేషమును విడనాడి 'హలో బ్రదర్' అంటాడు. వానిని మీరు తిట్టటం ప్రారంభిస్తే వాడు కూడా మిమ్మల్ని తిట్టటం ప్రారంభిస్తాడు.

గౌరవాన్నిచ్చి గౌరవాన్ని పుచ్చుకోండి

మీరు ఇతరులను గౌరవించనప్పుడు ఇతరులు మిమ్మల్ని ఎలా గౌరవించగలరు? కనుక, ప్రతి వ్యక్తిని మీరు గౌరవించండి. అప్పుడు మీ గౌరవముకూడా పెరుగుతుంది. ఈనాటి మానవుడు ఎదుటివ్యక్తి తనను గౌరవించాలని ఆశిస్తున్నాడుకాని, తాను ఎదుటి వ్యక్తిని గౌరవించడం లేదు. మానవుడనగా గౌరవింపదగినవాడని అర్థం. మీరు మానవులుగా జన్మించినారు కనుక, గౌరవాన్నిచ్చి గౌరవాన్ని పుచ్చుకోండి. ఇదియే ఈనాడు మీరు నేర్చు కోవలసినది. మనం మంచి మాటలు మాట్లాడినప్పుడు ఎదుటి వ్యక్తి కూడా మనతో మంచిమాటలే మాట్లాడతాడు. మనం గౌరవంగా పలుకరించినప్పుడు ఎదుటివ్యక్తి కూడా మనలను గౌరవంగా పలుకరిస్తాడు. మీరు ఒకరికి నమస్కరించినప్పుడు ఆ నమస్కారము ఎవరికి చెందుతుంది? ఆ వ్యక్తిలోని హృదయవాసియైన భగవంతునికి చేరుతుంది. మీరు నమస్కరించేది పాంచభౌతికమైన దేహమునకు కాదు ఈ దేహము ఎటువంటిది?

*మలినపు కొంప రోగముల క్రుగ్గెడు సేవకగంప జాత సం*
*చలనము పొందు దుంప భవసాగరమీదగలేని కంప అం*
*బులపొదిలెమ్మ చూడు మన ముప్పుదలంపగ దేహమింక ని*
*శ్చలమని నమ్మబోకు మనసా! హరిపాదము లాశ్రయింపవే!*

ఇటువంటి దేహముపై ఆధారపడితే మనం ఏమి సాధించగలము? ఈ దేహమును ఆధారము చేసుకొని పాపమును ప్రోగుచేసుకోకండి. దేహము మృణ్మయమైనది. దేహములో ఉన్న దివ్యత్వము చిన్మయమైనది. ఇట్టి దివ్యత్వమును ఆధారం చేసుకొని గౌరవాన్ని సంపాదించుకోండి. పరులకు సేవచేసే నిమిత్తం దేహమును పోషించుకోండి. సేవ నిమిత్తమే దేహమును ధరించినామని విశ్వసించండి. దేహమును ధరించినది దేహమును సుఖపెట్టుకునే నిమిత్తం కాదు. ఏమిటీ దేహముతో అనుభవించే సుఖము? ఏమీ ప్రయోజనం లేదు. ఎన్ని సుఖాలను అనుభవించినప్పటికీ ఒక్క క్షణంలో అన్నీ వదలిపెట్టిపోవలసివస్తుంది. ఇట్టి క్షణభంగురమైన జీవితముకొరకు ఇన్ని అవస్థలా? ప్రతి జీవిని గౌరవించాలి. అదే నిజమైన దైవసేవ. సంవత్సరమునకు ఒక పర్యాయం సేవ చేయడానికి పూనుకుంటే ప్రయోజనమేమిటి? ఇంతేనా జీవితము? కాదు, కాదు. సేవకే మన దేహమును అంకితము చేయాలి. అప్పుడు మనకు ప్రతి నిమిషం నూతనమే! నిత్యం పండుగే!

అబ్రహాం లింకన్ చాలా బీదకుటుంబములో జన్మించాడు. బాల్యంలో అతను శ్రీమంతుల పిల్లలతో కలిసి స్కూలుకి వెళ్ళేవాడు. ఆ పిల్లలు విలువైన దుస్తులను, ఆభరణాలను ధరించి స్కూలుకి వచ్చేవారు. కాని, లింకన్ మాత్రం చినిగిపోయిన పాతదుస్తులను తల్లిచేత కుట్టించుకొని, వాటిని ధరించి స్కూలుకి వెళ్ళేవాడు. ఒకనాడు తోటిపిల్లలు లింకన్ దుస్తులను చూసి గేలిచేశారు. లింకన్ ఏడ్చుకుంటూ తల్లివద్దకు వెళ్లి "అమ్మా! నేను ఇక మీదట స్కూలుకి పోను. నా తోటివిద్యార్థులందరూ నన్ను చూసి హేళన చేస్తున్నారు. నాకు మంచిదుస్తులు లేవని, నేను బీదవాడినని నన్ను హీనంగా చూస్తున్నారు" అన్నాడు.

అప్పుడా తల్లి కుమారుణ్ణి చెంత కూర్చోపెట్టుకొని "నాయనా! ఇంత మాత్రమునకే నీవు వగచనక్కర్లేదు. ఇదంతా నీ భవిష్యత్తుకు మంచిదే! నీవు మన కుటుంబపరిస్థితిని దృష్టిలో పెట్టుకో, ఎవరేమన్ననూ నీవు లెక్కచేయవద్దు. ఆత్మవిశ్వాసముతో, ఆత్మ గౌరవముతో జీవించు. ప్రతి వ్యక్తిని నీవు గౌరవించు. అప్పుడు నిన్ను అందరూ గౌరవిస్తారు" అని బోధించింది. ఆనాటి నుండి లింకన్ తల్లి మాటననుసరించి అందరినీ గౌరవిస్తూ వచ్చాడు. చెప్పులు కుట్టేవానితో సైతం ఎంతో గౌరవంగా మాట్లాడేవాడు. "అయ్యా, నీవు ధన్యుడవు! మా కాళ్ళకు ముళ్ళు గ్రుచ్చుకోకుండా మాకొరకు చెప్పులు కుట్టి ఎంతో సేవ చేస్తున్నావు" అనేవాడు. ఈరీతిగా లింకన్ తన మంచితనముచేత అందరి గౌరవాన్ని అందుకున్నాడు. మంచిపేరు తెచ్చుకున్నాడు. ఒక పర్యాయం ఎన్నికలు వచ్చాయి. లింకన్ స్నేహితులందరూ అతనివద్దకు

వచ్చి ఎలక్షన్లలో పోటీ చేయవలసిందిగా బలవంతం చేశారు. "నేను బీదవాడిని. నాకెవరు వేస్తారు ఓటు? నాకు అధికారాలు పదవులూ వద్దు" అన్నాడు లింకన్. ఈనాడు మన భారతీయులు ఎలక్షన్లకొరకు కోట్లు ఖర్చుపెడుతున్నారుగాని, భిక్షగానికి ఒక కాసు ఇవ్వాలంటే మాత్రం వెనక్కిపోతున్నారు. లింకన్ తన స్నేహితుల ప్రోద్బలముచేత ఎలక్షన్లలో పోటీ చేసి విజయం సాధించాడు. కొంతకాలానికి ప్రజలంతా కలసి అతనిని అమెరికా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అప్పుడతను తల్లివద్దకు వచ్చి, "అమ్మా! ఆనాడు నీవు చేసిన ప్రబోధలే ఈనాడు నాకింతటి గౌరవాన్ని తెచ్చిపెట్టాయి" అన్నాడు.

"మాతృదేవోభవ, పితృదేవో భవ"

పిల్లలు మంచిపేరు తెచ్చుకోవాలంటే తల్లి ఆజ్ఞను శిరసావహించాలి. వేదము 'మాతృదేవోభవ, పితృదేవో భవ' అంటూ మాతాపితరులకు అత్యున్నతమైన స్థానమును అందించింది. తల్లి మన దేహమువంటిది, తండ్రి ఆత్మవంటివాడు. కాబట్టి, తల్లిదండ్రులను మనం గౌరవించాలి. అప్పుడు మనకెంతైనా గౌరవము లభిస్తుంది. తల్లిదండ్రులు సంపాదించిన ధనమును సద్వినియోగం చేయాలి. మన దేహములో ఉన్న ప్రతి రక్తపుచుక్కలోను తల్లిదండ్రుల ప్రేమతత్త్వమే నిండి ఉన్నది. అయితే, ఎవరికైనా అవసరం వచ్చినప్పుడు మీ రక్తాన్ని కూడా దానం చేయటానికి మీరు సిద్ధంగా ఉండాలి. స్వార్థంకోసం పాటుపడవద్దు. స్వార్థ స్వప్రయోజనములే మానవుణ్ణి హీనుని చేస్తున్నవి. ఈనాటి పిల్లలు తల్లిదండ్రులు సంపాదించిన ధనాన్ని దుర్వినియోగం చేస్తూ వారికి దుఃఖం కలిగిస్తున్నారు. దురభ్యాసములకు లోనై తమ జీవితాన్నే వ్యర్థం గావించుకుంటున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ తల్లిదండ్రులకు దుఃఖం కలిగించకూడదు. సద్గుణములు, సత్ప్రవర్తనలను అలవరచుకొని వారికి మంచిపేరు తెప్పించాలి. ధనమువలన మంచిపేరు రాదు, గుణము వలననే వస్తుంది. గుణము లేకపోతే ఎంతటి ధనవంతుడైనా అపకీర్తి పాలవుతాడు. ధనవంతులు గొప్పగొప్ప భవనాలలో నివసిస్తూ ఉండవచ్చు. కాని, వారి మనస్సుకి కించిత్తైనా శాంతి సౌఖ్యములు లేవు. "ఇంకా సంపాదించాలి, ఇంకా సంపాదించాలి" అని ప్రాకులాడుతున్నారు. మనం సంపాదించిన ధనమును సత్కర్మలకు వినియోగించాలి. సత్ప్రవర్తనతో మెలగాలి. సదాచారములను అలవరచుకోవాలి. అప్పుడే మన జీవితానికి నిజమైన శాంతి చేకూరుతుంది. ఈనాడు లోకంలో ప్రతి ఒక్కరూ శాంతి కావాలని ఆశిస్తున్నారు. శాంతి ఎక్కడుంది? మీలోనే ఉంది. మీరు పరమ పవిత్రులు. Love is within you. Peace is within you. మీలోనే ఉన్న పవిత్రమైన ప్రేమను, శాంతిని కోల్పోయి ఏదో సంపాదించాలని ఆరాటపడుతున్నారు; గొప్ప గొప్ప మేడలు నిర్మించాలని ఆశిస్తున్నారు. సరియైన గుణము లేకపోతే మీరు సంపాదించిన ధనమంతా వ్యర్థమైపోతుంది. గుణముకంటే మించిన ధనము లేదు. గుణము ఖర్చుపెట్టేకొలదీ పెరుగుతుందేగాని, తరగదు.

వెంటవచ్చేవి పాపపుణ్యాలేగాని, సిరి సంపదలు కావు

విద్యార్థినీ విద్యార్థులారా! మీరు పెద్దపెద్ద చదువులు చదువుతున్నారు. అయితే, దేనికోసం ఈ చదువులు? ధనసేవకోసం కాదు, దైవసేవకోసమే! దైవసేవయే ప్రధాన మైనది. ధనసేవ మిమ్మల్ని పతనం చేస్తుంది. ధనము కొంతవరకు ఉండవలసిందే! కాని, అధికమైన ధనము అశాంతిని కలిగిస్తుంది. మనకు ప్రధానమైనది ప్రేమధనము. దానిని అభివృద్ధిపరచుకోవాలి. సత్యమనే ధనమును సంపాదించుకోవాలి. 'సత్యాన్నాస్తి పరోధర్మః' కాబట్టి సత్యధర్మములను అనుసరిస్తూ మన జీవితాన్ని ధన్యం గావించుకోవాలి. అంతేగాని, ధనమును బాగా సంపాదించి, బ్యాంకుల్లో డిపాజిట్ చేసి పాస్‌బుక్కులను కాపాడుకుంటూ కూర్చుంటే మీకు కలిగే లాభమేమిటి? పోయే సమయంలో ఒక్క నయాపైస కూడా మనవెంటరాదు.

ప్రపంచాన్నంతటినీ జయించిన అలెగ్జాండర్ చక్రవర్తి చిట్టచివరికి ఈ సత్యాన్ని గుర్తించి పశ్చాత్తాపపడ్డాడు. అతను ప్రపంచాన్నంతా జయిస్తూ భారతదేశానికి వచ్చాడు. భారతదేశమంతటా తిరిగాడు. భారతదేశాన్ని

వదలిపెట్టి వెళ్లిపోయే సమయంలో అతనికి గుండెపోటు వచ్చింది. తాను మరణించే ముందు మంత్రులను, అధికారులను పిలిపించాడు. "నాకు చాలా బాధగా ఉన్నది. మీరు నాకొక సహాయం చేసి నా బాధను నివారించాలి" అన్నాడు. మంత్రులు "రాజా! మీకు కలిగిన బాధ ఏమిటి? మీవద్ద కావలసినంత ధనమున్నది. మీకు సేవచేయటానికి ఎంతోమంది సేవకులున్నారు. మీకేమి తక్కువ?" అన్నారు. అప్పుడు అలెగ్జాండర్ "మీరు చెప్పింది నిజమే! నాదగ్గర కావలసినంత ధనమున్నది; రత్నాల రాసులున్నాయి. కాని, అవేవీ నాకు శాంతినివ్వటం లేదు. అంత్యసమయంలో నాకు సహాయపడటం లేదు. కాబట్టి, నేను మిమ్మల్ని కోరేదేమిటంటే, మరణించిన తరువాత నా రెండు చేతులూ అందరికీ కనిపించేలాగున పైకిపెట్టి నా దేహాన్ని శ్మశానానికి తీసుకువెళ్ళండి. 'అలెగ్జాండర్ అనేక రాజ్యాలను జయించాడు. కావలసినంత సిరిసంపదల నార్జించాడు. కాని, అంత్య సమయంలో అవేవీ అతనికి సహాయపడలేదు. తాను జయించిన రాజ్యాలను, సిరిసంపదలను వదలిపెట్టి వట్టిచేతులతోనే తిరిగి వెళుతున్నాడు' అని ప్రజలకు తెలియజేయండి" అన్నాడు.

ఈనాటి మానవుడు తన జీవితమునంతా ధన సంపాదనకు అంకితం చేసి చివరికి నిరాశతో నిష్క్రమిస్తున్నాడు. కట్టకడపటికి మనకు సహాయం చేసేది మనం చేసిన త్యాగమే! మనల్ని ఎప్పటికీ రక్షించేది జ్ఞానధనమే! కాబట్టి ధనముపై ఆశను విడనాడి జ్ఞానధనమును సంపాదించండి. కష్టాలలో ఉన్నవారికి సేవ చేయండి. దీనులకు, దిక్కులేనివారికి కడుపునిండా తిండిపెట్టండి. కంటికెదురుగా కనపడే వారికి సహాయం చేయకుండా కనిపించని దైవానికి పూజచేయడం పిచ్చితనం! దేవుడెక్కడున్నాడు? మీలోనే ఉన్నాడు. మీ ఇంట, వెంట, జంటగా ఉన్నాడు. మీలోనే ఉన్న దేవుని విస్మరించి, లోకముయొక్క మెప్పుకోసం ప్రాకులాడితే మీకు కలిగే ప్రయోజనమేమీ లేదు.

ప్రేమస్వరూపులారా! మీరు చదివిన చదువును, మీరు సంపాదించిన ధనమును తోటిమానవులతో పంచుకోండి. మీ ధనమునకు అధికారి దైవమే. మీ ధనము దైవముయొక్క ట్రస్టుకు సంబంధించినది. ఈ ట్రస్టుకు ప్రెసిడెంటు దైవమే! దైవముపై మీరు 'ట్రస్టు' (విశ్వాసము) నిలిపి మీధనమును సద్వినియోగపరచుకోండి. ధనకనకవస్తువాహనాదులకోసం మీరు ప్రాకులాడకండి. నిరంతరం దైవాన్ని మాత్రమే స్మరించండి. దైవమును వెతకటానికి ఏ కొండగుహలకో, అడవులకో పోనక్కర్లేదు. దైవము మీ వెంటనే, జంటనే, ఇంటనే ఉన్నాడనే దృఢమైన విశ్వాసంతో రాక్షసత్వాన్ని జయించండి. ఈనాడు రాక్షసత్వం మితిమీరిపోతున్నది. ధనంకోసం పాపాలను మూటగట్టుకుంటున్నారు. చివరికి మీ వెంట వచ్చేవి పాపపుణ్యాలేగాని, సిరిసంపదలు కావు. కాబట్టి, మీరు తినే ఆహారంలో పిడికెడు అన్నమైనా ఇతరులకు పెట్టండి. మిమ్మల్ని మీరు పోషించుకోవటంతోపాటు ఇతరులకు కూడా సహాయం చేయండి. ఇదియే గొప్ప సాధన. ఇలాంటి సులభమైన సాధనను వదలిపెట్టి, సున్నితమైన ప్రేమతత్త్వాన్ని విస్మరించి శాంతికోసం మీరు ఎక్కడెక్కడికో వెళ్ళటం వెర్రితనం.

### త్యాగముద్వారానే శాశ్వతానందము ప్రాప్తిస్తుంది

ప్రేమస్వరూపులారా! ఈ నూతన సంవత్సరంలో మీరు నూతనమైన, పవిత్రమైన భావాలను పెంచుకోండి. త్యాగము, ప్రేమ, సత్యము – ఈ మూడింటినీ పెంచుకుంటే మీరు ధన్యులవుతారు. సమాజంలో మీతోటివ్యక్తిని ప్రేమించండి. అతనితో మంచిగా మాట్లాడండి. అతనికేమైనా సహాయం కావలసివస్తే చేయండి. ఇంతకంటే గొప్ప సాధన మరొకటి లేదు. పరమాత్మస్వరూపులారా! ఈ ప్రపంచములో మీరు బ్రతికినంతకాలమూ త్యాగముతో మీ జీవితాన్ని ధన్యం చేసుకోండి. "త్యాగేనైకే అమృతత్వమానశుః" త్యాగము ద్వారానే మీకు శాశ్వతమైన ఆనందము లభిస్తుంది. త్యాగము చేయని మానవునికి ఎక్కడికి పోయినా శాంతి లభించదు. "శాంతి శ్శాంతి శ్శాంతిః" అని శాంతికోసం అన్ని దేశములవారూ ప్రార్థిస్తూనే ఉన్నారు. కాని, శాంతి లభిస్తున్నదా? లేదు.

నిరంతరం నిరాశా నిస్పృహలలోనే మునిగిపోతున్నారు. మీలోనే ఉన్న భగవంతుని విస్మరించి భగవంతుడు ఎక్కడో బయట ఉన్నాడనే భావముతో ఆరాధన సల్పితే మీకు శాంతి ఏరీతిగా లభిస్తుంది?

ప్రేమస్వరూపులారా! ఏది జరిగినా మన మంచి కోసమే అని విశ్వసించండి. మీకు ఏదైనా కష్టము వచ్చిందంటే, ఇదెక్కడినుండి వచ్చిందని మీరు వెతకనక్కర్లేదు. అది మీనుండి వచ్చినదే! మీరు ఇతరులను గౌరవించినప్పుడు ఆ గౌరవమే మిమ్మల్ని కాపాడుతుంది. మీరు ఇతరులను అవమానిస్తే, ఆ అవమానమే మిమ్మల్ని శిక్షిస్తుంది. సుఖముగాని, దుఃఖము గాని మీకై మీరు సంపాదించు కున్నవే! మీరు చేసిన పాపపుణ్యములు మీ నీడవలె మిమ్మల్ని వెంటాడుతుంటాయి. కనుక, మీకు ఏ బాధ కలిగినప్పటికీ ఇతరులపై నిందవేయకండి. ఎవ్వరినీ దూషించకండి. అందరినీ ప్రేమించండి. మానవులందరినీ సోదరీసోదరులుగా చూసుకోండి. అందరూ భగవంతుని బిడ్డలేనని విశ్వసించండి. మంచిని మీరు ఆచరించి ఇతరులకు బోధించండి

ప్రేమస్వరూపులారా! మీరు ఇతరులకు మంచిని బోధించేముందు మీరు ఆచరించి చూపించండి. మీరు ఆచరించకుండా చేసే బోధనలకు విలువేముంటుంది? అదంతా కేవలం ఒక 'స్టంటు'! మనం ఎన్ని చదివినప్పటికీ, ఎన్ని బోధనలను శ్రవణం చేసినప్పటికీ వాటిని ఆచరణలో పెట్టకపోతే అవి ఏమాత్రం మనకు సహాయం చేయలేవు. మీతోటి వ్యక్తికి కించిత్తైనా సహాయం చేయండి. అవసరమైనప్పుడు అదే మీకు సహాయపడుతుంది. భారతీయులుగా జన్మించటం నిజంగా మీ అదృష్టం. భారతదేశంలో లేనిది ఈ ప్రపంచంలో ఎక్కడా లేదు. కాని, ఈనాడు భారతీయులలో ప్రేమతత్త్వము గోచరించటం లేదు. ప్రేమ ఒక్కటి ఉంటే ఇంక భారతీయులకు మించిన వారు మరొకరుండరు. కనుక ప్రేమచేత మన గౌరవాన్ని పెంచుకోవాలి. ప్రేమచేత సత్యధర్మాలను పోషిస్తూ రావాలి. ప్రేమయే మనలను సదా రక్షిస్తుంది.

(శ్రీవారు "ప్రేమముదిత మనసె కహో..." అనే భజనగీతమును పాడి పిమ్మట తమ దివ్యోపన్యాసమును కొనసాగిస్తూ ఇలా అన్నారు)

ప్రేమస్వరూపులారా! నోటితో భగవన్నామ కీర్తన చేయాలి. దానికి తగినట్లు చేతులతో తాళం వేయాలి భావరాగతాళములతో భగవంతుని భజించేవారు భారతీయులు. భ – భక్తి, ర – రాగము, త – త్యాగము. ఈ మూడింటినీ చేర్చి భగవంతుని కీర్తించాలి. అట్టివారే నిజమైన భారతీయులు. భారతదేశంలో పుట్టిన ప్రతి మానవుడూ ధన్యుడే! మనకు ఏ స్వర్గమూ వద్దు. భగవంతుని స్మరించుకుంటూ సేవలలో పాల్గొందాం. ఇంతకంటే మించిన సాధన లేదు. ఇంతకంటే మించిన ధనము లేదు. ఇంత గొప్ప ధనము మన దగ్గర పెట్టుకొని మనం ఎందుకు బాధపడాలి? మీరు చదివే చదువులు, చేసే పనులన్నీ దైవకార్యాలుగా భావించుకోండి. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని భగవద్గీతలో కృష్ణపరమాత్మ బోధించినట్లుగా, మీసర్వకర్మలను భగవదర్పితం గావించండి. అప్పుడే మీకు సర్వవిధములుగా శాంతి చేకూరుతుంది.

(2004 జనవరి 1వ తేదీ సాయంత్రం సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)